సాక్షి
వికారాబాద్

శనివారం । 11 । జనవరి । 2025



'సమీకృతం'.. అసంపూర్ణం

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణం పలు ప్రాంతాల్లో అసంపూర్తిగా మిగిలింది. నిధుల లేమితో పనులు నిలిచిపోయాయి. 10లో▸



ఝులక్ జర్నీ!

సంక్రాంతి రద్దీ మొదలైంది. విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో జనం సొంత ఊళ్లకు తరలివెళ్తున్నారు. 10లో▸



పౌష్టికాహారం వడ్డించాలి

సర్కారు బడుల్లో మధ్యాహ్న భోజనంలో నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ విశ్వప్రసాద్ అన్నారు. 11లో▸

న్యూస్‌రీల్

ధరణి సర్వర్‌డౌన్

నెమ్మదించిన రిజిస్ట్రేషన్లు

దౌల్తాబాద్: ధరణి సర్వర్‌డౌన్‌తో రైతులు ఇబ్బంది పడుతున్నారు. సాంకేతిక కారణంగా నాలుగైదు రోజులుగా రిజిస్ట్రేషన్లు నెమ్మదించాయి. ఇప్పటికే వ్యవసాయ భూ క్రయవిక్రయదారులు రిజిస్ట్రేషన్ల కోసం 30 మంది వరకు స్లాట్ బుక్ చేసుకొని నిరీక్షిస్తున్నారు. కొత్తగా స్లాట్ బుక్ చేసుకోవడానికి మీసేవ కేంద్రాలకు వెళ్లిన వారికి ఆన్‌లైన్ నమోదు చేయగానే సర్వర్‌డౌన్, లాగ్ ఔట్ అని చూపుతుందని పేర్కొంటున్నారు. దీంతో మండలంలో స్లాట్ బుక్ కాక క్రయవిక్రయదారులు నిత్యం మీసేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

పోలీసు వ్యవస్థపై నమ్మకం పెంచాలి

ఎస్పీ నారాయణ రెడ్డి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

దుద్యాల్: ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకం కలిగించాలని ఎస్పీ నారాయణ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన దుద్యాల్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వవద్దని ఆదేశించారు. ఆపదలో ఠాణాకు వచ్చిన వారితో స్నేహంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు డయల్ 100పై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్, కొడంగల్ సీఐ శ్రీధర్ రెడ్డి, ఎస్ఐ భరత్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు నిలిపివేత

అనంతగిరి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ నెల 13,14,15 తేదీల్లో జిల్లాలోని కాటన్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లను నిలిపివేశామని మార్కెటింగ్ జిల్లా అధికారి సారంగపాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని సూచించారు.

గ్రామాల్లో ఫార్మా ప్లాట్ల జాబితా ప్రదర్శన



తాడిపర్తి పంచాయతీ కార్యాలయం వద్ద అతికించిన జాబితా

యాచారం: ఫార్మాసిటీకి భూములు సేకరించిన నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల రైతులకు అందజేసిన ప్లాట్ల జాబితాను ఆయా గ్రామాల్లో శుక్రవారం ప్రకటించారు. ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు 121 గజాల చొప్పున ప్లాట్ల సర్టిఫికెట్లు ఇచ్చారు. కందుకూరు మండలం మీరాఖాన్‌పేటలోని 620 ఎకరాల్లో టీజీఐఐసీ మెగా వెంచర్ ఏర్పాటు చేసింది. ఆ వెంచర్‌లోనే ప్లాట్లు ఇవ్వడం కోసం మూడేళ్ల క్రితం అర్హులైన రైతులకు సర్టిఫికెట్లు ఇచ్చారు. ఫార్మాలో భూములు కోల్పోయిన వారికే సర్టిఫికెట్లు వచ్చాయా.. లేదా నకిలీలకు వచ్చాయా.. అనే వివరాలు తెలుసుకోవడం కోసం రెవెన్యూ అధికారులు ఆ నాలుగు గ్రామాల్లో సర్టిఫికెట్ల జాబితాను ప్రదర్శించారు. త్వరలో సర్టిఫికెట్లు ఇచ్చిన రైతులకు స్థలాలు చూపించడంతో పాటు ఆ నంబర్లేసి రిజిస్ట్రేషన్లు చేస్తారు.

'ఫ్యూచర్' పరిహారంపై అభిప్రాయసేకరణ



రైతులతో సమావేశమైన ఆర్డీఓ

కందుకూరు: ఫ్యూచర్ సిటీ వరకు వంద మీటర్ల విస్తీర్ణంలో నిర్మించనున్న రహదారిలో భూములు కోల్పోతున్న మండల పరిధిలోని రాచులూరు రెవెన్యూలోని రైతులతో శుక్రవారం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కోల్పోతున్న భూములకు ఎంత పరిహారం ఇవ్వాలని రైతుల అభిప్రాయం కోరగా వారు ఎకరాకు రూ.2 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి డిమాండ్‌ను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పి సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ముక్తిమార్గం.. ఉత్తరదర్శనం



కొడంగల్: పద్మావతి ఆలయంలో ఉత్తర ద్వారంలో దర్శనమిస్తున్న స్వామివారు





వికారాబాద్: తిరుపతి వెంకన్న సన్నిధిలో స్పీకర్ ప్రసాద్‌కుమార్

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని జిల్లాలోని ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. భక్తులతో కిటకిటలాడాయి. గోవింద నామస్మరణతో మారుమోగాయి. స్వామివారి ఉత్తర దర్శనం కోసం శుక్రవారం వేకువ జామునుంచే భక్తులు బారులు తీరారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవకమిటీల ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



వికారాబాద్: వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి



తాండూరు రూరల్: దస్తగిరిపేట్ శ్రీదేవి భూదేవి వేంకటేశ్వర స్వామి ఆలయంలో..

నిబంధనలు ముద్దు.. నిర్లక్ష్యం వద్దు

ఏటా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు



షాద్‌నగర్ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మృత్యువాత పడుతున్న ప్రయాణికులు

- ఈ నెల 31 వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు
- ప్రమాదాల నివారణకు అవగాహన సదస్సులు

షాద్‌నగర్: అతివేగం.. నిర్లక్ష్యం నిండు ప్రాణాలను బలితీసుకుంటున్నాయి.. ఎంతోమందిని ఆస్పత్రులపాలు చేస్తున్నాయి.. నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరిగి ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. అయినా వాహనదారుల్లో కనువిప్పు కలగడం లేదు. వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా లేకపోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. రోడ్డు నియమాలు పాటించకపోవడం, ఓవర్‌స్పీడ్, మైనర్ల డ్రైవింగ్ ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి.

ఆగని ప్రమాదాలు

గత ఏడాదిలో జిల్లాలో 1,394 ప్రమాదాల్లో 430 మంది మృత్యువాత పడ్డారు. మూడేళ్ల కాలంలో జరిగిన ప్రమాదాలను పరిశీలిస్తే.. 2021లో 996 ప్రమాదాల్లో 340 మంది, 2022లో 971 ప్రమాదాల్లో 260 మంది, 2023లో 997 ప్రమాదాల్లో 354 మంది మృత్యువాత పడ్డారు. ప్రతి ఏడాది మృతుల సంఖ్య పెరుగుతూనే ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

నివారణపై అవగాహన

ప్రమాదాలు నివారణకు ప్రభుత్వం ఏటా జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తోంది. రోడ్డు నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాహనదారులు, ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ట్రాఫిక్, రవాణాశాఖ, ఆర్టీసీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించేందుకు ఈ నెల 1 నుంచి 31 వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తోంది. గ్రామాలు, పట్టణాలు ముఖ్య కూడళ్లు, రద్దీ ప్రదేశాల్లో ఆటో, స్కూల్ బస్సు డ్రైవర్లకు రహదారి భద్రతపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

జరిమానాల విధింపు

మద్యం తాగి వాహనాలు నడిపించినా, ర్యాష్ డ్రైవింగ్ చేసినా, పరిమితి సంఖ్యకు మించి ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించుకున్నా, హెల్మెట్ ధరించకున్నా, సీటు బెల్టు లేకున్నా చట్ట ప్రకారం శిక్షార్హులు అవుతారని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా రోడ్డు నిబంధనలు పాటించాలని సూచిస్తున్నారు.

ఇవీ నిబంధనలు

- ట్రాఫిక్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలి.
- ఎవరైనా వాహనం నడిపించాలంటే విధిగా డ్రైవింగ్ లైసెన్సు, వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలి.
- ర్యాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ చేయడం నేరం.
- మద్యం తాగి వాహనాలు నడిపించొద్దు, వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లొద్దు.
- మలుపుల వద్ద వేగాన్ని తగ్గించాలి
- వాహనాలు నడిపేటప్పుడు ఫోన్‌లో మాట్లాడొద్దు.
- రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ఎదుటి వాహనాలకు దూరంగా ఉండాలి.
- ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి, కార్లలో ప్రయాణిస్తున్న వారు సీటు బెల్టు పెట్టుకోవాలి.

రోడ్డు భద్రత అందరి బాధ్యత



రోడ్డు భద్రత అందరి బాధ్యత. వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి. తద్వార ప్రాణాలు నివారించవచ్చు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలి. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దు.

– వాసు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, షాద్‌నగర్

రోడ్డు ప్రమాదాల్ని నివారిద్దాం

షాద్‌నగర్‌రూరల్: వాహనదారులు నియమాలు పాటించి ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని సైబరాబాద్ రోడ్డు సేఫ్టీ డీసీపీ ఎల్‌సీ నాయక్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్‌లో ట్రాఫిక్ ఎస్ఐ రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో ట్యాక్సీ డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎల్‌సీ నాయక్ మాట్లాడుతూ.. రెప్ప పాటులో జరిగే పొరపాటు ప్రమాదాలకు దారి తీస్తుందని అన్నారు. డ్రైవర్లు ఏకాగ్రతతో వాహనాలు నడపాలని సూచించారు. మద్యం తాగి నడపరాదన్నారు. ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం మాట్లాడుతూ.. మైనర్‌లకు వాహనాలు ఇవ్వడంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. కార్లు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని, ద్విచక్ర వాహనాలను నడిపేవారు హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ గురువయ్య, ఎంవీఐ వాసు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆశ'ల పోరు పట్టని ప్రభుత్వం



పరిగి: ఎమ్మెల్యే టీఆర్ఆర్ ఇంటి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆశవర్కర్లు

- కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలి
- సీఐటీయూ నాయకుల డిమాండ్
- ఎమ్మెల్యే నివాసం, కార్యాలయం ఎదుట నిరసన

పరిగి/తాండూరు: 'ఆశల శ్రమను ప్రభుత్వం గుర్తించడం లేదు. సమస్యలు పరిష్కరించాలని నిరసనలు చేపట్టినా.. వారిని పట్టించుకోవడం లేదు' అని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. కార్యకర్తల శ్రమను సర్కారు దోచుకుంటుందని విమర్శించారు. శుక్రవారం పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి నివాసం, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ఎదుట ఆశలు నిర్వహించిన ధర్నాకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మద్దతుగా మాట్లాడారు. ఆశ కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనంగా నెలకు రూ.18 వేలు చెల్లించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడంతో పాటు, ప్రభుత్వ ఉద్యోగులకు కల్పిస్తున్న అన్ని రకాల సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎం పోస్టుల్లో ప్రమోషన్ కల్పించాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఆశలు నిరసన వ్యక్తం చేసిన సమయంలో.. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశల సమస్యలు పరిష్కరిస్తానని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పేర్కొందని తెలిపారు. అధికారం చేపట్టి ఏడాది గడిచినా.. వారి సమస్యలు పరిష్కరించడం లేదని విమర్శించారు. ఆశల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం తాండూరు ఎమ్మెల్యే పీఏ నందకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశలు రేణుక, అనంత, భాగ్యలక్ష్మి, శ్రీదేవి, అంజమ్మ, సులోచన, జగదేవి, మున్ని, రాధమ్మ, అరుణ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



తాండూరు: ఎమ్మెల్యే పీఏకు వినతిపత్రం అందజేస్తున్న ఆశలు

కుష్టు వ్యాధి నివారణే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ

అనంతగిరి: రెండేళ్లలో కుష్టు వ్యాధిని సమూలంగా నిర్మూలించడమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పీహెచ్‌సీ లెప్రసీ నోడల్ అధికారులు, ఆపరేటర్లకు కుష్టు కేసుల ఆన్‌లైన్ నమోదు తదితర వాటిపై ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నికుష్ట్ యాప్‌లో వ్యాధిగ్రస్తుల వివరాలను నమోదు చేసినట్లయితే గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు రోగుల వివరాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కేసుల సంఖ్యను ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుంటుందని పేర్కొన్నారు. గ్రామాల్లో ఆశలు పర్యటించి లెప్రసీ అనుమానితులను గుర్తించి, ప్రాథమిక దశలోనే చికిత్స అందజేస్తే.. వ్యాధి మరొకరికి సంక్రమించకుండా కాపాడటానికి అవకాశం ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో లెప్రసీ నియంత్రణ జిల్లా అధికారి డాక్టర్ రవీంద్రయాదవ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జీవరాజు, ప్రవీణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపీవీతో శ్వాస సమస్యలు

హెచ్‌ఎంపీవీ శ్వాస సంబంధిత సమస్యలు కలిగించే వైరస్ అని, ఇది అన్ని వయస్సుల వారికి సంక్రమించవచ్చని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. ఎవరికైనా ఇలాంటి సమస్యలు ఉన్నట్లు గుర్తిస్తే.. వెంటనే ఐహెచ్ఐపీ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులతో ఆయన జూమ్ మీటింగ్ నిర్వహించారు. జిల్లా పరిధిలో అనుమానిత కేసులు నమోదు అయినట్లయితే చికిత్స అందించేందుకు తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో 20 పడకలు, వికారాబాద్ జనరల్ హాస్పిటల్‌లో పది పడకల ఐసోలేషన్ వార్డును ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అన్ని పీహెచ్‌సీలలో వైరల్ టెస్టింగ్ కిట్లతో పాటు సరిపడా మాస్కులను, యాంటీ వైరల్ మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

గీజర్ సలసల.. మీటర్ గిరగిర!

- చలిలోనూ హీటెక్కుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- ఉదయం 7.30 గంటల సమయంలో డిమాండ్
- ప్రతిరోజూ గరిష్టంగా 60 ఎంయూల నమోదు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలులకు మంచు తోడవుతోంది. చలికి జనం గజగజ వణికిపోతుంటే.. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రం హీటెక్కుతున్నాయి. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు, ఉద్యోగులకు కార్యాలయాలకు తయారయ్యే సమయం ఉదయం 7.30 నుంచి 8.30 గంటల మధ్యలో డిమాండ్ అధికంగా నమోదవుతోంది. స్నానానికి వేడి నీళ్ల కోసం ప్రతి ఇంట్లో గీజర్ వినియోగం తప్పని సరిగా మారింది. గీజర్‌తో బకెట్‌లోని నీళ్లు సలసలా కాగుతుంటే.. విద్యుత్ మీటర్ గిరగిరా తిరుగుతోంది. సామర్థ్యానికి మించి విద్యుత్ డిమాండ్ నమోదవుతుండటంతో ఒత్తిడికి తట్టుకోలేక కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. సాధారణంగా ఏప్రిల్, మే నెలలో నమోదు కావాల్సిన రోజు సగటు గరిష్ఠ (60 మిలియన్ యూనిట్లు) డిమాండ్ సంక్రాంతికి ముందే నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పుడే ఈ పరిస్థితి ఉంటే వచ్చే వేసవిలో ఎలా ఉండబోతోందో. రోజు సగటు డిమాండ్ వంద మిలియన్ యూనిట్లకు చేరుకునే అవకాశం లేకపోలేదని డిస్కం అంచనా వేస్తోంది. ఆ మేరకు లైన్ల పునరుద్ధరణ పనులు చేపడుతోంది.

ప్రయాణికులు సకాలంలో ఎయిర్‌పోర్టుకు చేరుకోవాలి

సాక్షి, సిటీబ్యూరో: సంక్రాంతి సందర్భంగా నెలకొన్న రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికులు సకాలంలో ఎయిర్‌పోర్టుకు చేరుకోవాలని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశీయ ప్రయాణికులు తమ ప్రయాణ సమయానికి కనీసం 2 గంటలు, అంతర్జాతీయ ప్రయాణికులు 3 గంటల ముందే ఎయిర్‌పోర్టుకు చేరుకోవాలని సూచించారు. ప్రయాణానికి అవసరమైన డాక్యుమెంట్‌లను జాగ్రత్తపర్చుకోవాలని, తనిఖీల్లో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా డీజీ యాత్రం సేవలను వినియోగించుకోవాలని కోరారు. సంక్రాంతి దృష్ట్యా మరింత రద్దీ పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

నూతన నియామకం

బంట్వారం: మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బంట్వారం జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కె.సంతోష ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆమె గాంధీభవన్‌లో పార్టీ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు సునితారావు చేతు లమీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా సంతోష మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని తెలిపారు. అనంతరం పార్టీ పెద్ద లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ రథయాత్రను జయప్రదం చేయండి

తాండూరు: ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఎమ్మార్పీఎస్ చేపట్టిన రథ యాత్రను జయప్రదం చేయాలని సమితి జిల్లా అధ్యక్షుడు కొడిగంటి మల్లికార్జున్ మాదిగ పిలు పునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడు తూ.. బషీరాబాద్ మండల కేంద్రం నుంచి నేడు రథయాత్ర ప్రారంభమవుతుందని తెలి పారు. రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలు చేపట్ట కముందే వర్గీకరణ అమలు చేయాలని కోరారు. ఈ మేరకు నగరంలో ఫిబ్రవరి 7న నిర్వహించనున్న లక్ష డప్పులు, వెయ్యి గొం తుల మహా ప్రదర్శనకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సమితి జిల్లా ఉపాధ్య క్షుడు నర్సింహులు, జగదీష్, బలరాం, జిల్లా కన్వీనర్ శివాజీ, రవికుమార్, జాని, బాల రాజు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

క్యూ ఆర్ కోడ్‌తో అభిప్రాయం తెలపండి



అనంతగిరి: క్యూ ఆర్ కోడ్ ద్వారా పోలీసు సేవ లపై ప్రజలు తమ అభిప్రాయాలను తెల పాలని ఎస్పీ నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పోలీసు సేవల గురించి ప్రజాభిప్రాయం తెలుసుకోవడానికి క్యూఆర్ కోడ్ పోస్టర్(సిటీజన్ ఫీడ్ బ్యాక్ క్యూఆర్ కోడ్)ను ఆవిష్కరించారు. కోడ్ పోస్టర్‌ను జిల్లాలోని అన్ని పీఎస్, సర్కిల్, డీఎస్పీ, ఎస్పీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచామని, సోషల్‌మీడియాలోనూ ఉందని పేర్కొన్నారు. ఈ కోడ్‌ను స్కాన్ చేసి, వచ్చిన లింక్‌ను తెరిచి.. సిబ్బంది సేవలపై అభిప్రాయాలు తెలపాలని సూచించారు.

జాతీయ జట్టులో చోటు



విజయ్‌ని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం అనంతగిరిప ల్లి సమీపంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలుర రెసిడెన్షియల్‌లో 8వ తరగతి చదువు తున్న విజయ్.. ఖోఖో జాతీయ స్థాయి పోటీ లకు ఎంపికయ్యాడని స్కూల్ ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా వారు విద్యార్థిని అభినందించారు. యూపీలో జరుగు తున్న పోటీలకు వెళ్తున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో ఆడటం పాఠశాలకు గర్వకా రణం అని పేర్కొన్నారు.

అనుమతులు లేకుండా చెట్ల తొలగింపు



చెట్లను తొలగిస్తున్న జేసీబీ

పరిగి: రాఘవపూర్ రెవెన్యూ పరిధిలోని వెంక టసాయి రైస్ మిల్లు పక్కన హైవే అథారిటీ ఆధ్వర్యంలో ఏపుగా పెరిగిన చెట్లను జేసీబీతో ధ్వంసం చేశారు. జాతీయ రహదారి గుండా నాటిన మొక్కలను ఎలా తొలగిస్తారని పలు వురు అభ్యంతరం తెలిపినా సదరు వ్యక్తులు పట్టించుకోలేదు. ఈ విషయంపై సుల్తాన్‌పూర్ పంచాయితీ కార్యదర్శి నర్సింగ్‌రావును వివ రణ కోరగా తమ దృష్టికి రాలేదన్నారు. రోడ్డు పక్కన నాటిన మొక్కలను తొలగించాలంటే నేషనల్ హైవే రోడ్డు అథారిటీ నుంచి అనుత మలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

'సమీకృతం' అసంపూర్ణం

కూరగాయలు.. పూలు.. పండ్లు.. మాంసం ఇలా విక్రయాలన్నీ ఒకే చోట ఉండేలా.. రోడ్ల పక్కన అమ్మకాలను నివారించేలా గత ప్రభుత్వ హయాంలో సమీకృత (ఇంటిగ్రేటెడ్) మార్కెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. చాలాచోట్ల పనులు ప్రారంభమైనప్పటికీ నిధులు లేకపోవడంతో ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. యథావిధిగా రహదారుల పైనే విక్రయాలు కొనసాగుతున్నాయి.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్లకు నిధుల గ్రహణం

- మధ్యలోనే నిలిచిపోయిన నిర్మాణ పనులు
- రోడ్లపైనే క్రయవిక్రయాలు

నిధులు లేక నిలిచిపోయి..



అసంపూర్తిగా నిలిచిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్

ఆమనగల్లు: నిధులు లేకపోవడంతో పట్టణంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు అసంపూ ర్తిగా నిలిచిపోయాయి. నాలుగేళ్ల క్రితం ప్రారం భించిన మార్కెట్ పనులు నేటికీ పూర్తికాకపోవడం తో కూరగాయలు, మాంసం విక్రయాలు స్థానిక పట్టణంలోని అంగడి బజార్‌లో రోడ్లపై కొనసాగు తున్నాయి. మార్కెట్ నిర్మాణానికి నాలుగేళ్లక్రితం ప్రభుత్వం రూ.4.5 కోట్లు మంజూరు చేసింది. స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో 2021 నవంబర్ 8న అప్పటి మంత్రులు సబితా రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శంకు స్థాపన చేశారు. ఏడాది అనంతరం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పది నెలల క్రితం పనులను నిలిపివేశారు. కాంట్రాక్టర్ ఇప్పటి వరకు రూ.3.30 కోట్ల పనులు చేపట్టగా ప్రభుత్వం రూ.2.26 కోట్లు మంజూరు చేసింది. కాంట్రా క్టర్‌కు రూ.1.04 కోట్ల బిల్లు రాకపోవడంతో పనులు నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి రూ.4.50 కోట్లకు అదనం గా రూ.1.49 కోట్లు అవసరమవుతాయని అధి కారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఆదిబట్లలో నిలిచిన మోడల్ మార్కెట్‌నిర్మాణం పనులు

మో'డల్' మార్కెట్

ఇబ్రహీంపట్నం రూరల్: మోడల్ మార్కెట్ నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది. ఆదిబట్ల మున్సిపాలిటీలో ఆదర్శంగా నిర్మాణం చేపడతామని టీయూఎఫ్ఐడీసీ నిధులతో మూడేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులు రూ.2 కోట్లతో హడవుడిగా పనులు చేపట్టారు. ప్రస్తుతం ఉత్సవ విగ్రహంలా మారింది. మొండి గోడలు దర్శనమిస్తున్నాయి. అన్ని మార్కెట్లు ఒకే చోటకు తీసుకొచ్చి పట్టణ ప్రజలకు అనువుగా ఉండేలా సమీకృత మార్కెట్ నిర్మించారు. స్లాబులు వేసి వదిలేశారు. మూడేళ్లుగా పనులు చేసినా నయా పైసా రాకపోవడంతో కాంట్రాక్టర్ అర్ధంతరంగా పనులు నిలిపివేశారు.

త్వరగా పనులు చేపట్టాలి



ఆదిబట్లలో మోడల్ మార్కెట్ నిర్మాణం మధ్యలోనే ఆపేశారు. అధికారులు, కాంట్రాక్ట ర్లకే విషయం తెలియా లి. ఎందుకు పనులు చేయడం లేదో తెలియడం లేదు. మార్కెట్ నిర్మాణం పూర్తి చేస్తే బాగుంటుంది. అధికా రులు చొరవ తీసుకొని పూర్తి చేయాలి.

– పల్లె శ్రీనివాస్‌గౌడ్, ఆదిబట్ల

ప్రారంభించేలా చూస్తాం



ఆదిబట్లలో రోడ్డు పక్క నే పట్టణానికి కొద్ది దూరంలో మోడల్ మార్కెట్ భవన నిర్మా ణం చేపట్టారు. 50 శాతం పనులు పూర్త య్యాయి. బిల్లులు రాక పనులు చేయడం లేద ని కాంట్రాక్టర్లు చెబుతు న్నారు. ఇప్పటికే కాంట్రాక్టర్లతో మాట్లాడటం జరిగింది. త్వరలో ప్రారంభించేలా చూస్తాం.

– బాలకృష్ణ, కమిషనర్, ఆదిబట్ల

క్రీడలతో మానసికోల్లాసం



రన్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

అనంతగిరి: క్రీడలలో శారీరక ధారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 8వ జాతీయ యువ జన ఉత్సవాలలో భాగంగా శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని స్వామి వివేకానందా గురుకుల పాఠ శాల ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన 3కె రన్‌ను ఆయన ప్రారంభించారు. యువత.. స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఇలాంటి పోటీలు పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యం వెలికితీసేందుకు దోహదపడ తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో యజ్ఞ ఇన్‌చా ర్జి ఉజ్వల్ రాజ్, పలువురు ఉపాధ్యాయులు, విద్యా ర్థులు తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్లు నరికినవారిపై కేసుల నమోదు

ఆమనగల్లు: కడ్తాల్ మండలం చరికొండలో అనుమతి లేకుండా తాటిచెట్లను నరికిన ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ తెలిపారు. చరికొండకు చెందిన శ్రీరా ములు, నాగిళ్లకు చెందిన గోపాల్, రాములుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. గీత కార్మికుల జీవనో పాధి అయిన తాటిచెట్లను అనుమతిలేకుండా నరి కితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కళాశాల నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

బొంరాస్‌పేట: ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాలు.. ఆయన ముఖ్యమంత్రి అయ్యాక కార్యరూపం దాలుస్తున్నాయి. ఏళ్లతరబడి జూనియర్ కళాశాలకు నోచుకోని మండలం.. ఆయన హామీతో మంజూరు అయింది. భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.4.80 కోట్లు నిధులు మంజూరు చేసిందని సంబంధిత అధికారులు తెలి పారు. అదే విధంగా మండల పరిధి బురాన్‌పూ ర్‌లో బీసీ గురుకుల పాఠశాల రూ.25 కోట్లతో నిర్మాణం కానుంది. ఈ మేరకు శుక్రవారం విద్యా సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఎస్ఈ షఫీ, ఈఈ రామ్‌కుమార్‌లు, పార్టీ నాయకులు స్థల పరిశీలన చేశారు. మండల కేంద్రం శివారులో జాతీయ రహదారి 163 సమీపంలోని మదర్సా వెనుక ఉన్న ప్రభుత్వ భూమిలో కళాశాల నిర్మాణా నికి రెండు ఎకరాలు, గురుకుల పాఠశాలకు బురాన్ పూర్ శివారులో ఐదు ఎకరాల భూమిని పరిశీలిం చారు. అధికారుల వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులు గౌడ్, కొడంగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేశం, రాంచంద్రారెడ్డి, భీమ య్యగౌడ్, నరేందర్, అధికారులు డీఈ రాజు, ఏఈ శ్రీనివాస్, సర్వేయర్ మహేశ్ తదితరులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు రెండు ఇళ్లు దగ్ధం

కాలిబూడిదైన పత్తి, యూరియా బస్తాలు

ధారూర్: ప్రమాదవశాత్తు రెండు ఇళ్లు దగ్ధమైన సం ఘటన మండల పరిధి నాగారంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకా రం.. గ్రామానికి చెందిన మున్నూరు అశోక్, పాల్గు ణలు అన్నదమ్ములు. వీరిద్దరూ ఒకే ఇంట్లో వేర్వే రుగా ఉంటున్నారు. ఇళ్లకు తాళాలు వేసి పొలం పను లను వెళ్లారు. ఈ క్రమంలో కొద్దిసేపటికి ఇంట్లో నుం చి పొగలు రావడాన్ని స్థానికులు గమనించారు. వెం టనే కుటుంబీకులు వారికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చే సరికి అశోక్ ఇల్లు పూర్తిగా కాలిపోయిం ది. ఈ ఘటనలో సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగింది. ఇంట్లోని 10 క్వింటాళ్ల పత్తి, రూ.50వేల నగదు, బట్టలు, బియ్యం, వంట సామగ్రి బూడిద య్యాయి. పక్కనే ఉన్న పాల్గుణ ఇంటికి మంటలు వ్యాపించి నిత్యవసరాలు, యూరియా బస్తాలు, బియ్యం, జొన్నలు సంచులు ఇతర సామగ్రి దగ్ధ మయింది. పంచాయతీ నీటి ట్యాంకర్‌తో మంట లను అదుపులోకి తెచ్చారు. విషయం తెలుసుకున్న పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి వారిని పరామ ర్శించి, ఇళ్లను పరిశీలించారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధి తిమ్మారెడ్డిప ల్లిలో రూ.20 లక్షలతో సీసీరోడ్లు, మరో రూ.20 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లా డుతూ.. గ్రామాల్లోని ప్రతి వీధిలో సీసీరోడ్లతో పాటు అంతర్గత మురుగు కాలువల నిర్మాణాలు చేపడు తున్నామని పేర్కొన్నారు. అదే విధంగా పంచాయతీ లకు పక్కా భవనాలు ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. వచ్చే నాలుగేళ్ల కాలంలో సమస్యలు లేని గ్రామాలుగా తీర్చి దిద్దనున్నామని వివరిం చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గీతాసింగ్ నాయక్, పీఆర్ డీఈ మాధవరెడ్డి, ఎంపీడీఓ అను రాధ, మాజీ సర్పంచ్ పద్మ, నాయకులు రాజశేఖర రెడ్డి, బాల్‌రెడ్డి, నర్సిహారెడ్డి తదిరతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

- మైనర్లు వాహనాలు నడపొద్దు
- డీఎస్పీ శ్రీనివాస్



మాసోత్సవాల్లో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్

పరిగి: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలని డీఎస్పీ శ్రీనివాస్ సూచిం చారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్ర వారం పట్టణ కేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. వాహన చోదకులు ప్రతి ఒక్కరూ లైసెన్స్‌తో పాటు.. వాహన పత్రాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్ప నిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, పిల్లలు వాహనాలు నడిపితే.. వారి తల్లిదండ్రులపై చట్టప రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. బాగా చదువుకుని, లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్య క్రమంలో సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ సంతోష్‌కు మార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీ కొట్టిన కారు

షాద్‌నగర్‌రూరల్: ఆటోను కారు ఢీ కొట్టిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు కాగా ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ టోల్‌ప్లాజా సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుశీల కథనం ప్రకారం.. మహబూ బ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం చౌదూర్‌కు చెం దిన లక్ష్మణ్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తూ గ్రామంలో నివసిస్తున్నాడు. నిత్యం మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ నుంచి షాద్‌నగర్‌కు ప్యాసింజర్ ఆటో నడుపుతున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం ఇద్దరు ప్రయాణికులను ఎక్కించుకొని షాద్‌నగర్ వస్తున్నాడు. జడ్చర్ల నుంచి షాద్‌నగర్ వైపు వస్తున్న కారు అతివేగం గా వచ్చి ముందు వెళ్తున్న ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఆటో పల్టీలు కొడుతూ రోడ్డు కిందకు వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న కిశోర్, డ్రైవర్ లక్ష్మణ్ తలకు తీవ్ర గాయాలు కాగా కారులోని వ్యక్తికి స్వల్ప గాయాల య్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబు లెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చిలుకూరుకు భక్తుల తాకిడి

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాల యంలో శుక్రవారం భక్తుల సందడి నెలకొం ది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా పెద్ద సం ఖ్యలో తరలివచ్చారు. ఇక్కడ ఉత్తర ద్వారం లేకున్నా భక్తులు మాత్రం వైకుంఠ ఏకాదశి రోజు స్వామివారిని దర్శించుకోవాలని చిలు కూరుకు వచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రద్దీ విపరీతంగా కొనసా గింది. దీంతో మధ్యాహ్నం వరకు ప్రదక్షిణలు నిలిపివేశారు. ఆలయ అర్చకుడు రంగరాజన్ భక్తులకు వైకుంఠ ఏకాదశి విశిష్టతను తెలియ జేశారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. అనంతరం శివాలయంలో పూజలు చేశారు.

లారీ బైక్ ఢీ.. యువకుడి మృతి

పూడూరు: లారీ బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘ టన చెన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్ర వారం చోటుచేసుకుంది. ఎస్ఐ మధుసూదన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. దుద్యాల మండలం ఈర్లపల్లి గ్రామానికి చెందిన పాత్లావత్ సురేష్(22).. తన ద్విచక్ర వాహనంపై చేవెళ్ల నుంచి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో పూడూరు మండల పరిధి మీర్జాపూర్ గేటు వద్ద లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యువకుడు అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని వెల్లడించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి జరిమానా

- కొందరికి జైలు శిక్ష
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: సీఐ

యాలాల: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన పది మందికి జరిమానాతో పాటు, అందులో ఒకరికి ఒక రోజు జైలు శిక్షను విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఉమా హారతి శుక్రవారం తీర్పు ఇచ్చారు. మండల పరిధి పలు గ్రామాలకు చెందిన పది మంది ఇటీవల మద్యం తాగి డ్రైవ్ చేస్తూ.. పోలీసులకు పట్టుబ డ్డారు. వీరిలో ఎనిమిది మందికి రూ.వెయ్యి, మరొ కరికి రూ.2 వేలు, ఇంకొకరికి రూ.వెయ్యి జరిమా నతో పాటు ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారని ఎస్ఐ గిరి తెలిపారు.

మందుబాబులకు జైలు శిక్ష

తాండూరు రూరల్: మద్యం సేవించి వాహనాలు నడి పిన మందుబాబులకు ఒకరోజు జైలు శిక్ష విధించారు. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. వారం రోజుల క్రితం మండల పరిధి గౌతపూర్ అనుబంధ గ్రామం గోపన్‌పల్లి వద్ద పోలీసులు చేపట్టిన డ్రంకన్ డ్రైవ్‌లో వీరొట్టిపల్లి గ్రామానికి చెందిన శంకరప్ప, ఇం ద్రనగర్‌కు చెందిన సంయుల్లా పట్టుబడ్డారు. వీరు ద్దరిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించగా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్, జిల్లా అడిషనల్ కలెక్టర్ ఉమాహారతి ఇద్దరికి ఒకరోజు జైలు శిక్ష విధించగా.. శుక్రవారం వారిని జైలుకు పంపించామని ఎస్ఐ తెలిపారు.

ఇద్దరికి ఒకరోజు జైలు శిక్ష

తాండూరు: మద్యం తాగి వాహనం నడిపించిన వారితో పాటు.. మైనర్లు వాహనం నడిపిన కేసు లో.. వారి పెద్దవారికి జరిమానాతో పాటు ఇద్దరికి ఒకరోజు జైలు శిక్ష విధించారు. పట్టణ సీఐ సంతోష్ కుమార్ కథనం మేరకు.. డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబ డిన 15 మందికి రూ.వెయ్యి చొప్పున జరిమానా, అందులో ఇద్దరికి ఒకరోజు జైలు శిక్షను విధించడం తో పాటు, 15 మంది మైనర్లకు వాహనాలు ఇచ్చిన యజమానులకు రూ.2.500 చొప్పున జరిమానా విధిస్తూ తాండూరు కోర్టులో సెకండ్ క్లాస్ మెజి స్ట్రేట్‌లు, అసిస్టెంట్ కలెక్టర్ ఉమహారతి తీర్పును వెలువరించారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.



నగరంలోని సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న కలెక్టర్ ప్రతీక్‌జైన్ చిత్రంలో ఇతర జిల్లాల అధికారులు

– అనంతగిరి

ఝులక్ జర్నీ!

ప్రత్యేక రైళ్లతో ప్రయాణికులకు చుక్కలే

- వివిధ మార్గాల్లో గంటల తరబడి ఆలస్యం
- పట్టాలపైనే రైళ్లు.. పడిగాపుల్లో ప్రయాణికులు
- సంక్రాంతికి అరకొరగా ప్రత్యేక రైళ్లు
- ప్రైవేట్ బస్సుల్లో దారి దోపిడీ
- ఆర్టీసీ 50 శాతం అదనపు వసూళ్లు



సొంతూరికి వెళ్లేందుకు ఎంజీబీఎస్‌లో పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

సాక్షి, సిటీబ్యూరో: సంక్రాంతి రద్దీ మొదలైంది. విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో నగర వాసులు సొంత ఊళ్లకు తరలివెళ్తున్నారు. నగరం నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే అన్ని రెగ్యులర్ రైళ్లలో రిజర్వేషన్‌లు పూర్తిగా నిలిచి పోయి రిగ్రేట్ దశకు చేరాయి. కొత్తగా అందుబాటు లోకి వచ్చిన చర్లపల్లి టెర్మినల్ నుంచి కాకినాడ, తిరుపతి, విశాఖ, విజయవాడ తదితర ప్రాం తాలకు కొన్ని ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశారు. లక్షలాది మంది నగరవాసులు సొంత ఊళ్లకు తరలి వెళ్తుండగా.. అరకొరగా ఏర్పాటు చేసిన ప్రత్యేక రైళ్లు ఏ మాత్రం ప్రయాణికుల డిమాండ్‌లను భర్తీ చేయడం లేదు. మరోవైపు అన్ని ప్రత్యేక రైళ్లు గం టల తరబడి ఆలస్యంగా నడుస్తూ ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు అతికష్టంగా బెర్తులు సంపాదించి రైలెక్కినా గంటల తరబడి పట్టాలపైనే పడిగాపులు కాయాల్సి వస్తోం ది. సికింద్రాబాద్ నుంచి సాయంత్రం 6 గంటలకు బయలుదేరితే మరుసటి రోజు మధ్యాహ్నం 12 దాటినా విశాఖకు చేరుకోలేకపోయామని కూకట్‌ప ల్లికి చెందిన కృష్ణారావు విస్మయం వ్యక్తం చేశారు. మరోవైపు నాంపల్లి, కాచిగూడ స్టేషన్‌ల నుంచి శబ రిమలకు నడిచే రైళ్లు కూడా అయ్యప్ప భక్తులకు నరకం చూపుతున్నాయి. రెండు రోజులు గడిచినా హైదరాబాద్ నుంచి శబరిమలకు, తిరిగి అక్కడి నుంచి ఇక్కడికి చేరుకోలేకపోతున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చార్జీలు కూడా 'ప్రత్యేకమే'..

☛ నగరం నుంచి ప్రతి రోజు సుమారు వందకు పైగా రెగ్యులర్ రైళ్లు వివిధ ప్రాంతాలకు రాకపో కలు సాగిస్తాయి. సుమారు 2.5 లక్షల మంది ప్రయాణం చేస్తారు. ప్రస్తుతం రోజుకు మరో 50 వేల మంది అదనంగా బయలుదేరే అవకాశం ఉంది. ఈ డిమాండ్ మేరకు అదనపు రైళ్లు లేవు. కొన్ని రైళ్లలో బెర్తులు, అదనపు బోగీలు ఏర్పాటు చేశారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు మాత్రం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశారు. కానీ ఈ రైళ్లలో చార్జీలు కూడా ఎక్కువే. సాధారణ చార్జీలపై 25 శాతం వరకు అదనపు చార్జీలు విధిస్తారు. అయినప్పటికీ మరో గత్యంతరం లేక ప్రత్యేక రైళ్లను ఆశ్రయించే ప్రయాణికులకు రైళ్లలో పడిగాపులు తప్పడం లేదు.

☛ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పట్టాలపై రైళ్ల ఒత్తిడి పెరిగిందని, దీంతో సకాలంలో సిగ్నల్స్ లభించ కపోవడం వల్ల జాప్యం చోటుచేసుకుంటోందని అధికారులు చెబుతున్నారు. కానీ ఈ ఆలస్యం ప్రయాణికుల పండగ సంతోషాన్ని ఆవిరి చేస్తోం ది. కనిష్టంగా 3 నుంచి గరిష్టంగా 12 గంటల వరకు కొన్ని రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. గతంలో ఇలాంటి ఫిర్యాదులు పెద్ద ఎత్తున వెల్లు వెత్తినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు చేప ట్టకపోవడం గమనార్హం. సంక్రాంతి సందర్భం గా బయలుదేరిన ప్రయాణికులు భోగి పండగ రోజు కూడా సొంత ఊళ్లకు చేరుకోలేకపో యారు. ప్రస్తుతం మరోసారి అదే పరిస్థితి నెల కొందని పేర్కొంటున్నారు.

ప్రైవేట్ బస్సుల దోపిడీ..

సంక్రాంతి రద్దీని సొమ్ము చేసుకొనేందుకు ప్రైవేట్ ట్రావెల్స్ అడ్డగోలుగా దారి దోపిడీకి పాల్పడుతు న్నాయి. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి విశాఖకు లగ్జరీ రూ.1800 వరకు ఉంటుం ది. ఇప్పుడు ఆ చార్జీ రూ.3000 వరకు చేరింది. అలాగే ఏసీ బస్సుల్లో రూ.2500 నుంచి ఏకంగా రూ.5000 వరకు పెరిగినట్లు ప్రయా ణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి ల్లిపాదీ కలిసి వెళితే చార్జీల కోసమే రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోందని ఏఎస్‌రావు నగర్‌కు చెందిన మల్లికార్జున్‌రావు చెప్పారు. అలాగే.. హైదరాబాద్ నుంచి కాకినాడ, విజయ వాడ, తిరుపతి తదితర ప్రాంతాలకు సైతం ప్రైవేట్ బస్సుల దోపిడీ విమాన చార్జీలను తలపిస్తోంది.

ఆర్టీసీ సైతం అదే బాటలో..

ఆర్టీసీ సైతం ప్రత్యేక బస్సుల పేరిట 50 శాతం అద నపు దోపిడీకి దిగింది. ఏపీతో పాటు, తెలంగా ణలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో కూడా 25 శాతం నుంచి 50 శాతం వరకు అదనపు వసూళ్లకు పాల్పడుతోంది. చివరకు దివ్యాంగుల పాస్‌లను అనుమతించకుండా ఇష్టారాజ్యంగా చార్జీలు విధిస్తున్నారని ప్రయాణికులు చెబుతున్నారు. సం క్రాంతి రద్దీని దృష్టిలో ఉంచుకొని సుమారు 6 వేలకు పైగా అదనపు బస్సులను నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. రెండు రోజులుగా ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఎల్‌బీన గర్, ఉప్పల్, హయత్‌నగర్, ఎంజీబీఎస్, జేబీఎస్ తదితర ప్రాంగణాలుప్రయాణికులతో సందడిగా మారాయి.